క్లుప్తంగా

వైభవంగా పవిత్రాల సమర్పణ



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో రెండో రోజైన మంగళవారం పవిత్రోత్సవాలు వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా ఆలయ ంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి పవిత్ర సమర్పణ చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనాన్ని వేడుకగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని మూలవర్లకు, ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ రమేష్ పాల్గొన్నారు.

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న తెలంగాణ సీఎం సతీమణి



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సతీమణి గీతకు స్వాగతం పలుకుతున్న టీటీడీ అధికారులు

తిరుమల: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి గీత బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. మంగళవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్న ఆమెకు టీటీడీ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమెకు దర్శనం ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం ఆమె స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకుంటారు.

వాటికి దూరంగా ఉండండి!

తిరుపతి అర్బన్: సోషల్ మీడియాకు..సెల్‌ఫోన్లకు పిల్లలు దూరంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. మంగళవారం తిరుపతిలోని ఓ హోటల్‌లో పిల్లలపై ఆన్‌లైన్ సెక్సువల్ దోపిడీ, సైబర్ నేరాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రతి జిల్లాలోనూ ప్రత్యేకంగా ఓ సైబర్ పోలీస్‌స్టేషన్ ఉన్న నేపథ్యంలో వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరోవైపు ఇటీవల కొంతమంది బాలలు ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్ రాకెట్‌లో చిక్కుకుంటున్నారని హెచ్చరించారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు జంగం రాజేంద్ర ప్రసాద్, సీఐఎఫ్ సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సుబ్రతకుమార్ పాండా, గౌరీ, కొండప్ప, తిరుపతి జిల్లాకు చెందిన సైబర్ నేరాల పర్యవేక్షణ చేస్తున్న పోలీసు సిబ్బంది, స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమీరా వచ్చేస్తున్నా!

- అంతలోనే తిరిగిరాని లోకాలకు
- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- తల్లడిల్లిన భార్య



కొప్పల నారాయణ (ఫైల్)



ఘటనా స్థలంలో కొప్పలనారాయణ మృతదేహం

శ్రీకాళహస్తి: 'సమీరా వచ్చేస్తున్నా... మరో 15 నిమిషాల్లో నీ ముందుంటా.. నువ్వేం కంగారుపడకు.. బాబు తిన్నాడా..! నువ్వు భోజనం చేసి పడుకో.. ఐ యామ్ ఆన్‌ది వే..' అన్న భర్త తెల్లారేసరికి విగత జీవిగా కనిపించడం ఆమె గుండెల్ని పిండేసింది. ఈ ఘటన స్థానికంగా పెను విషాదాన్ని నింపింది. పోలీసుల కథనం..

బుచ్చినాయుడుకండ్రిగ మండలం, జోగికండ్రిగకు చెందిన కొప్పల ధర్మయ్య కుమారుడు కొప్పల నారాయణ(25) డిగ్రీ వరకు చదివి రౌతుసూరమాల సమీపంలో ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. నారాయణకు పెళ్లకూరు మండలం, నెలబల్లి దళితవాడకు చెందిన సమీరాతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో భార్య సమీరా కొడుకుతో కలిసి పుట్టింటికి వెళ్లింది. ఆమెను చూసేందుకు నారాయణ రెండు రోజుల కిందట నెలబల్లి వెళ్లాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో శ్రీకాళహస్తికి వెళ్లాడు. తిరిగి వస్తూ తన మేనత్త ఊరైన తాటిపర్తికి చేరుకున్నాడు. రాత్రి పది అవుతున్నా నారాయణ ఇంటికి రాకపోవడంతో సమీరా భర్తకు ఫోన్ చేసింది. తాను తాటిపర్తిలో ఉన్నానని, మరో 15 నిమిషాల్లో నీ ముందుంటానని సమాధానం ఇచ్చాడు. ఈ క్రమంలో నెలబల్లికి మార్గమధ్యంలో నాయుడుపేట–మదనపల్లి జాతీయ రహదారికి అతి సమీపంలో రామానాయుడు ఎస్టీ కాలనీ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి బండరాయిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. బండరాయిని ఢీకొన్న సమయంలో నారాయణ బైక్‌తో పాటు ముళ్లపొదల్లో పడిపోవడంతో ఎవ్వరూ గుర్తించలేకపోయారు. ఇప్పుడే వస్తానన్న భర్త తెల్లారైనా ఇంటికి రాకపోవడంతో సమీరా తాటిపర్తిలోని తమ బంధువులకు సమాచారం అందించింది. దీంతో వారు ఆరా తీయగా ముళ్లపొదల్లో విగతజీవిగా పడి ఉండడాన్ని చూసి బోరుమన్నారు. తొట్టంబేడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

పంచెకట్టు..దోచిపెట్టు!

- రాహు–కేతు పూజలకు పంచెలు ధరించాలని నిర్ణయం
- ముందుగా ప్రచారం లేకుండా 15 రోజుల క్రితం నిర్ణయం
- శ్రీకాళహస్తి ఆలయ ప్రాంగణంలో వ్యాపారుల దోపిడీ



శ్రీకాళహస్తి ఆలయంలో సంప్రదాయ దుస్తులతో రావాలని సూచిస్తున్న బోర్డు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారుల నిర్ణయాలు వ్యాపారులకు వరంగా మారాయి. సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండా అనుకున్నదే తడువుగా నిర్ణయాలు అమలు చేస్తుండడంతో భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. రాహు–కేతు పూజల్లో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తుల్లో రావాలని ఆలయ అధికారులు 15 రోజుల క్రితం నిబంధనలు పెట్టారు. ఈ సంప్రదాయం మంచిదే అయినప్పటికీ ముందుగా ప్రచారం చేసి ఉంటే భక్తులందరికీ తెలిసేది. ఉన్నపళంగా సంప్రదాయ దుస్తుల నిబంధన పెట్టడం శ్రీకాళహస్తి పట్టణంలోని కొందరు వ్యాపారులకు వరంగా మారింది. తెల్లవారు జామున బస్సులు, రైళ్లల్లో, వివిధ వాహనాల్లో ఆలయానికి వచ్చే భక్తులను కొందరు వ్యాపారులు రోడ్లపై అడ్డగించి నిలువు దోపిడీ చేస్తున్నారు. రాహు–కేతు పూజలు చేయించుకోవాలంటే తప్పనిసరిగా పురుషులు పంచెలు ధరించాలని భయపెడుతున్నారు. కొందరు మహిళలు కూడా వ్యాపారం చేస్తుండడంతో పురుష భక్తులు ఇబ్బంది పడుతున్నారు. రూ.200 విలువ చేసే పంచెను రూ.500కు అంటగడుతున్నారు. నిబంధనలు తెలియక భక్తులు వ్యాపారుల చేతుల్లో మోసపోతున్నారు. పట్టణంలోని తేరువీధిలో ఉన్న కొందరు వ్యాపారులు, భిక్షాల గాలిగోపురం, శివయ్య గోపురం ద్వారా వచ్చే భక్తులు దోపిడీకి గురవుతున్నారు. స్వామి, అమ్మవార్ల అర్ధ మండపం దర్శనం, అభిషేకాలకు మాత్రం సంప్రదాయ వస్త్రధారణ నిబంధన ఉంది. దీనిని సక్రమంగా అమలు చేయలేని అధికారులు రాహు–కేతు మండపాల్లో సంప్రదాయ వస్త్ర నిబంధన అమలుచేస్తున్నారు. దీంతో భక్తులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇదిలాగే కొనసాగితే ఆలయ ఆదాయానికి గండిపడే ప్రమాదముంది. పత్రికల్లో, టీవీల్లో వార్తలు వస్తున్నా స్థానిక కూటమి నాయకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పైగా ఆలయ అధికారుల నిర్ణయాలను సమర్థిస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎర్రచందనం పరిరక్షణకు కృషి



టాస్క్‌ఫోర్స్ పోలీసులతో ఎస్పీ శ్రీనివాస్, అటవీశాఖ అధికారులు

తిరుపతి మంగళం: శేషాచలం అడవుల్లోని ఎంతో విలువైన ఎర్రచందనం పరిరక్షణకు అందరూ బాధ్యతగా పనిచేయాలని టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ సూచించారు. తిరుపతి కపిలతీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో మంగళవారం టాస్క్‌ఫోర్స్ ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి ఉద్యోగులతోపాటు, టాస్క్‌ఫోర్స్ సబ్ కంట్రోల్ కార్యాలయాలు కడప, సానిపాయ, రైల్వే కోడూరు సిబ్బంది జూమ్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం లేకుండా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఉద్యోగులు పొరబాట్లకు తావు లేకుండా, ఏ విధంగా విధులు నిర్వహించాలనే అంశంపై దిశానిర్దేశం చేశారు. అరుదైన ఎర్రచందనాన్ని శేషాచలం అడవుల్లో సంరక్షించడం ఉద్యోగుల బాధ్యతగా పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు తమ సమస్యలను తెలియజేయగా, అప్పటికప్పుడే కొన్నింటిని పరిష్కరించారు. ఈ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ బాలిరెడ్డి, ఏసీఎఫ్ శ్రీనివాస్, ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, సీఐ సురేష్ కుమార్, ఎఫ్ఆర్ఓలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

7న మిక్స్‌డ్ రైస్ వేలం

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలకు హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన బియ్యంను నవంబరు 7వ తేదీన టెండర్ వేలం వేయనున్నారు. ఇందులో మిక్స్‌డ్ బియ్యం 13,880 కిలోలు టెండర్, వేలంలో ఉంచనున్నారు. ఆసక్తి గలవారు నవంబరు 7వ తేదీలోపు కార్యనిర్వహణాధికారి, టీటీడీ పేరిట రూ.25,000 ఈఎండీ, సీల్డ్ టెండర్ తోపాటు తిరుపతిలోని మార్కెటింగ్ విభాగం, జనరల్ మేనేజర్(వేలం) కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. అదేరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు టెండర్లను తీస్తారు. ఇతర వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయం, 0877–2264429 నంబరులో కార్యాలయం వేళల్లోనూ.. టీటీడీ వెబ్‌సైట్ www.tirumala.org... లోసంప్రదించాలని టీటీడీ అధికారులు తెలిపారు.

భరద్వాజ తీర్థంలో అశ్లీల నృత్యాలు



భరద్వాజ తీర్థంలో యూట్యూబర్ల నృత్యాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజ తీర్థంలో కొంతమంది యూట్యూబర్లు అశ్లీల నృత్యాలు చేస్తూ వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. భరద్వాజ తీర్థం భరద్వాజ మహర్షి తపస్సు చేసిన స్థలంగా ఖ్యాతి పొందింది. భక్తపరాయణుడైన శివయ్య సంవత్సరంలో ఒకరోజు తై అమావాస్యకు శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సతీసమేతంగా భరద్వాజ తీర్థానికి వచ్చి అభిషేక పూజలు అందుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ప్రశాంతమైన ఈ స్థలంలో తరచూ అసాంఘిక కార్యక్రమాలు పెచ్చుమీరుతున్నారు. కొంతమంది యువకులు చెట్లకింద కూర్చుని మద్యం సేవిస్తున్నారు. దీనికితోడు ఇటీవల యూ ట్యూబర్లు అశ్లీల నృత్యాలను ఇక్కడ చిత్రీకరించి సోషల్‌మీడియాలో పోస్టు చేయడం విమర్శలకు తావిస్తోంది. సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులు సరిగా విధులు నిర్వర్తించకపోవడం వల్లే ఇలాంటి తప్పిదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలు ఎక్కువగా పెరిగాయని మండిపడుతున్నారు. మూడు నెలలుగా సెక్యూరిటీ సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడంతో వారు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు దీనిపై దృష్టిసారిస్తారో.. లేక ఆ శివుడికే వదిలేస్తారో వేచి చూడాల్సి ఉంది.

ఫీజు బకాయిలు విడుదల చేయాలని నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థులతో కలసి నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చంద్రగిరి: గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీల మేరకు రూ.3,480 కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసనకు దిగారు. జిల్లా ఉపాధ్యక్షులు తేజ మాట్లాడుతూ.. విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.3,480 కోట్లను కూటమి ప్రభుత్వం రాగానే విడుదల చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలవుతున్న నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంకెప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. చంద్రగిరిలో ఎస్సీ హాస్టల్‌కు తక్షణమే సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గమైన చంద్రగిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం శోచనీయమన్నారు. డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని, మెస్ చార్జీలు రూ.3వేలకు పెంచాలని కోరారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, జీఓ నం.77ను రద్దు చేసి, పీజీ చదివే విద్యార్థులందరికీ ఫీజు రియింబర్స్‌మెంట్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలుపై నవంబర్ 6న జిల్లా కలెక్టర్ ఎదుట నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు కదలి రావాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, జిల్లా నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

5 నుంచి 'ఉల్లాస్'



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు

తిరుపతి అర్బన్: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన ఉల్లాస్ కార్యక్రమం నవంబర్ 5 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు తెలిపారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో మంగళవారం ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ 2వ తేదీ వరకు డీఆర్‌డీఏ పరిధిలోని సంఘమిత్రలకు శిక్షణ ఇచ్చామనిని, వారు నవంబర్ 5 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు రోజుకు రెండు గంటల చొప్పున 200 గంటలు బోధించాల్సి ఉందని చెప్పారు. అవసరమైన మేరకు పుస్తకాలు ఇస్తామన్నారు. అయితే సంఘమిత్రలు ఉచితంగా మాత్రమే బోధించాలని స్పష్టం చేశారు. వయోజన విద్య నోడల్ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ పొదుపు సంఘాల్లోని సభ్యులు 12,085 మందికి సంతకాలు చేయడం కూడా తెలియదన్నారు. వారందరికీ సరైన బోధన చేయాల్సి ఉందన్నారు. ఏపీఓ ప్రభాకర్‌రెడ్డి, ఏపీఎం ఉమాదేవి, వయోజన విద్య పర్యవేక్షకులు సుజాత, శైలజ, థామస్ అబ్రహం పాల్గొన్నారు.

రసవత్తర పోరు.. విజేతలు వీరు



మహేష్, మునివెంకట రెడ్డి , రాజ్ కుమార్, చీర్ల కిరణ్, దొరై రాజు

- నేడు అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోశాధికారి పదవులకు ఎన్నిక



కిషోర్ కుమార్, హేమ సుధ

తిరుపతి సిటీ, అలిపిరి: టీటీడీ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ బ్యాంకు డైరెక్టర్ పదవులకు ఎన్నికలు సోమవారం ముగిశాయి. మొత్తం 35మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. తిరుమల, తిరుపతిలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలలో మొత్తం 6,349 ఓటర్లకు గాను 5,553 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి ఉమాపతి వెల్లడించారు. మూడు రౌండ్ల కౌంటింగ్ ప్రక్రియ కోసం 8 టేబుళ్లను ఏర్పాటు చేసి సోమవారం రాత్రి 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభించారు. మంగళవారం వేకువ జాము 3 గంటల వరకు కౌంటింగ్ సాగింది.

రౌండ్ రౌండ్‌కూ ఉత్కంఠే

మొత్తం మూడు రౌండ్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌కూ అభ్యర్థుల్లో టెన్షన్ స్పష్టంగా కన్పించింది. బరిలో నిలిచిన 35 మందిలో సుమారు 10 మంది అభ్యర్థులు హోరాహోరీగా పోటీపడ్డారు. తొలి రౌండ్ ఫలితం అర్ధరాత్రి 12.45 గంటలకు వెలువడింది. పూర్తి ఫలితాలను మంగళవారంవేకువజాము 4.30 గంటలకు అధికారికంగా ప్రకటించారు.

నేడు అధ్యక్ష పదవికి ఎన్నిక

గెలుపొందిన బ్యాంకు డైరెక్టర్లలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కోశాధికారి పదవులకు బుధవారం ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తాం. ఉదయం 9 గంటలకు టీటీడీ సహకార పరపతి సంఘం కార్యాలయంలో పాలక మండలి సభ్యుల సమావేశం జరగనుంది. 10 గంటలకు ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. –ఎమ్.ఉమాపతి, ఎన్నికల అధికారి, టీటీడీ, తిరుపతి

ఇద్దరు గజదొంగల అరెస్ట్

- రూ.3.6 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం

తిరుపతి క్రైమ్: నగరంలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు గజదొంగలను క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు క్రైమ్ డీఎస్పీ రమణకుమార్ తెలిపారు. తిరుపతి రూరల్ చెందిన వేములపల్లి శివకుమార్, కృష్ణా జిల్లాకు చెందిన వేములపల్లి దుర్గ భార్యాభర్తలని, వీరిరువురూ తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడేవారన్నారు. వీరిని అలిపిరి బస్టాండ్ వద్ద తమ సిబ్బంది అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3.6 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు గతంలో 30కి పైగా దొంగతనాలు చేసి, జైలు శిక్ష కూడా అనుభవించారన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

మహిళా ఓటర్లే అధికం

–జిల్లాలో మొత్తం ఓటర్లు 18,11,685

తిరుపతి అర్బన్: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా 2025 షెడ్యూల్ ప్రకారం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మంగళవారం ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకోవడానికి నవంబర్ 28వ తేదీ వరకు గడువు ఉందని స్పష్టం చేశారు. తుది ఓటర్ల జాబితాను వచ్చే ఏడాది జనవరి 6వ తేదీన ప్రచురిస్తామని ఆయన స్పష్టం చేశారు. 2025 జనవరి 1కి 18 ఏళ్లు నిండిన వారు కొత్త ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా వచ్చే అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండనున్న వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 18,11,685 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అందులో పురుషులు 8,82,129, స్త్రీలు 9,28,543 మంది ఉన్నట్లు ప్రకటించారు. ఇతరులు 174 మంది, సర్వీస్ ఓటర్లు 839 మంది ఉన్నారన్నారు.

యువతరంగ్–24 వాల్‌పోస్టర్ విడుదల

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా గోడపత్రికను మంగళవారం ఆవిష్కరించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నవంబర్ 8,9,10 తేదీల్లో యువతరంగ్–24 పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయానికి విచ్చేసిన మంత్రితోపాటు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, కల్చరల్ కో–ఆర్డినేటర్ వివేక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, పరిశోధకులు నాదముని, డాక్టర్ ఉదయ్, రాజశేఖర్ గోడ పత్రిక ఆవిష్కరణలో పాల్గొన్నారు.

ఈఎస్ఐలో ఆయుర్వేద దినోత్సవం



మాట్లాడుతున్న వైద్యులు

తిరుపతి తుడా : అన్నమయ్య సర్కిల్ సమీపంలోని కార్మిక రాజ్య బీమా (ఈఎస్ఐ) ఆస్పత్రిలో మంగళవారం ఘనంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యం, ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే ఉపయోగాలపై రోగులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఏవీఎస్ ప్రసాద్, వైద్యులు కె.శ్రీధర్, పి.రమేష్ కుమార్, శ్రీలత, గాయత్రి, మంజరీ, నర్సింగ్ సూపరింటెండెంట్ సి.అమ్ములు పాల్గొన్నారు.


విద్యాభివృద్ధే లక్ష్యం



డీఈఓను కలిసి అభినందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లాలో విద్యాభివృద్ధికి, అలాగే ప్రభుత్వ విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీఈఓ కేవీఎన్.ప్రసాద్ తెలిపారు. ఇటీవల డీఈఓగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను మంగళవారం పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్ నాయకులు కలిసి అభినందించారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను డీఈఓకు వివరించారు. అలాగే ఉపాధ్యాయులకు భారంగా పరిణమిస్తున్న వివిధ యాప్‌ల నిర్వహణపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. దీనికి డీఈఓ సానుకూలంగా స్పందించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీ.శ్రీనివాస్‌యాదవ్, టీ.సదాశివన్, పాకాల ఎంఈఓ లింగయ్య, రాష్ట్ర నాయకులు రవి కుమార్‌యాదవ్, వెంకటేష్, రమేష్‌యాదవ్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.రమేష్, ఎస్.సురేష్, నాయకులు నరేంద్ర, జితేంద్రబాబు, దేవానంద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న గేట్ కళాశాల చైర్‌పర్సన్ పీ.విజయ

తిరుపతి సిటీ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి గేట్ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గేట్ కళాశాలల చైర్మన్ పీ.విజయ మాట్లాడుతూ కళాశాలలో జరిగిన జాబ్ మేళాలకు ఎనిమిది బహుళ జాతి కంపెనీలు పాల్గొన్నాయన్నారు. సుమారు 122 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్టు తెలిపారు. జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ రమేష్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, అధ్యాపకులు అభినందించారు.

క్లుప్తంగా

శేషాపురంలో గ్రామ సభ



మాట్లాడుతున్న తహసీల్దార్ శివరామసుబ్బయ్య

చంద్రగిరి : మండలంలోని శేషాపురంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ శివరామసుబ్బయ్య మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మ్యుటేషన్, ఎల్‌పీఎంలు, భూ తగాదాలు, 22ఏ అభ్యంతరాలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వీటిని ఆన్‌లైన్‌లో పొందుపరిచి త్వరితగతిన పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్ బాబు, ఆర్.విజయ్ కుమార్, వీఆర్‌ఓ ఇషాంత్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ నర్సింగ్ కళాశాల, చంద్రగిరిలోని మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం నర్సింగ్ విద్యార్థినులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితిలో రోగి ప్రాణాలు కాపాడే పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గంగా భవానీ, ఎస్వీ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సునీత, హైదరాబాద్ ఐసీఎంఆర్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషియన్‌లోని క్లినికల్ ఎపిడెమియాలజీ డివిజన్ విభాగాధిపతి డాక్టర్ జేజే బాబు, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ వెన్నల సాహితి, డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ నగర కమిటీ ఎన్నిక



హరికృష్ణ వినయ్ ప్రీతి

తిరుపతి కల్చరల్ : ఏఐఎస్‌ఎఫ్ నగర నూతన కమిటీని ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గంధమనేని శివయ్య భవన్‌లో చేపట్టిన ఏఐఎస్‌ఎఫ్ 17వ నగర మహా సభలో కొత్త కమిటీని ఎన్నుకున్నట్లు వెల్లడించారు. నగర అధ్యక్షుడిగా హరికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వినయ్, కోశాధికారిగా చిన్నం ప్రీతి, ఉపాధ్యక్షులుగా మోహన్, పులికొండ, వెన్నెల, మంజునాథ్, సహాయ కార్యదర్శులుగా చంద్ర నాయక్, శృతి, భరత్, నందకిషోర్, సయ్యద్‌తో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు.

ఘనంగా ధన్వంతరి జయంతి



పూజలు నిర్వహిస్తున్న అధికారులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో ధన్వంతరి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, రిజిస్ట్రార్ రమాశ్రీ ఆధ్వర్యంలో ధన్వంతరి విగ్రహానికి పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ధన్వంతరి బోధనలు పాటిస్తే రోగాలను నిర్మూలించవచ్చని సూచించారు. అందుకే ధన్వంతరిని ఫాదర్ ఆఫ్ ఆయుర్వేదంగా వ్యవహరిస్తారని వెల్లడించారు. డాక్టర్ బాలదత్తాత్రేయ, డీన్ దక్షిణామూర్తి శర్మ, ఎస్.లత, కాదాంబిని, డాక్టర్ చిరంజీవి పాల్గొన్నారు.

స్విమ్స్‌లో..

తిరుపతి తుడా : స్విమ్స్ యూనివర్సిటీలోని పద్మావతి ఆడిటోరియంలో ఆయుర్వేద శాస్త్ర పితామహుడు ధన్వంతరి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ ధన్వంతరి జయంతిని జాతీయ ఆయుర్వేద దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. డాక్టర్ వనజాక్షమ్మ, పాల్గొన్నారు.

మళ్లీ బాంబు బెదిరింపు



హోటల్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్ : నగరంలోని పలు స్టార్ హోటళ్లకు సోమవారం మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో తిరుచానూరు, అలిపిరి, ఈస్ట్, ఎమ్మార్‌పల్లె పోలీసులు వారి వారి పరిధిలోని స్టార్ హోటళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. డాగ్, బాంబ్ స్క్వాడ్‌లతో జల్లెడ పట్టారు. అయితే ఎలాంటి బాంబు లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఈ మేరకు ఆయా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేశారు.

నోరూరిస్తూ.. రోగానపడేస్తూ..!



నగరంలో పానీపూరీ వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరికీ ఈ స్ట్రీట్ ఫుడ్ నోరూరిస్తోంది. ముఖ్యంగా యువత సాయంత్ర వేళల్లో పానీపూరీ బండ్ల వద్ద పెద్దసంఖ్యలో చేరుతోంది. రోడ్డు పక్కన దుమ్మూధూళి పడుతూ ఉన్నా.. ఏమాత్రం పట్టించుకోకుండా లొట్టలు వేసుకుంటూ ఆరగిస్తోంది. అయితే ఇందులో లోగుట్టు కనిపెడితే మాత్రం రోగాలను వ్యాప్తి చేసే కేంద్రంగా కనపిస్తోంది. కలుషిత వాతావరణంలో సిద్ధమైన ఈ పదార్థాలను తింటే అనారోగ్యం బారిన పడాల్సిన దుస్థితి దాపురిస్తుంది. ప్రధానంగా పానీలో వినియోగించే రసాయనాలతో అసలైన ముప్పు పొంచి ఉంది. పూరీల తయారీలో వాడే నూనెల కారణంగా ఆరోగ్యానికి ఆపద వాటిల్లుతోంది.

పానీపూరీ ఇస్తున్న దృశ్యం

- పానీపూరీపై ఆసక్తి చూపుతున్న యువత
- నగరంలో ఇబ్బడిముబ్బడిగా వెలసిన విక్రయ బండ్లు
- కలుషిత వాతావరణంలో పదార్థాల తయారీ
- పలు వ్యాధుల బారిన పడే ప్రమాదముందంటున్న వైద్యులు

తిరుపతి మంగళం : నగరంలో నిత్యం చిన్నారులు మొదలు విద్యార్థులు, పెద్దల దాకా లాగించే ప్రధాన స్ట్రీట్‌ఫుడ్ పానీపూరీ. పూరీలకు మధ్యలో చిల్లు పెట్టి ఉడికించిన ఆలూ, కాబూలీ చెన్నా దట్టించి..ఆపై పుదీనా, చింతపండు మసాలా కలగలిపిన నీటిలో ముంచి ఇస్తుంటే మనోళ్లు గుటుక్కుమనిపిస్తుంటారు. దాని రుచికి ఫిదా అయిపోతూ వహ్వా అంటుంటారు. ప్రతి వీధిలో కనిపించే పానీపూరీ బండ్ల వద్ద ఈ టేస్ట్ ఎక్స్‌పీరియన్స్ కోసం క్యూ కడుతుంటారు. అయితే పుదీనా నీటిలో కలిపే కృత్రిమ రంగులు, పూరీల తయారీకి వాడే నూనెల వల్ల అనారోగ్యం పాలవుతారని వైద్యులు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల తమిళనాడు, కర్ణాటకలో పానీపూరీ నమూనాలను పరీక్షించగా అందులో క్యాన్సర్ కారకాలు ఉన్నట్లు తేలింది. దీంతో పానీపూరీల వినియోగంపై నిషేధం విధించాలని ఆ రాష్ట్రాలు యోచిస్తున్నాయి.

సమస్యలు అధికం

పానీపూరీ అంటే ఎంత ఇష్టమైనా అతిగా తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే తరచూ పానీపూరీ లాగించే వారిలో గ్యాస్టిక్ ట్రబుల్, ఎసిడిటీ అల్సర్ వంటి వ్యాధులు వస్తున్నట్లు చెబుతున్నారు. అలాగే టైఫాయిడ్, కలరా వంటి వ్యాధులు కూడా ప్రబలే ప్రమాదం ఉందని వైద్యులు వెల్లడిస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో తయారైన ఆహార పదార్థాల వల్ల క్షయ వ్యాధి సోకే ప్రమాదమూ ఉంది. ఇదే విషయాన్ని అంతర్జాతీయ జర్నల్స్‌లో పరిశోధకులు కూడా పేర్కొంటున్నారు. అపరిశుభ్ర ప్రదేశాల్లో ఉండే బ్యాక్టీరియాలు శోషరస గ్రంధుల్లోకి (లింఫ్ ఎడినైటిస్) చేరితే క్షయ వ్యాధి (ఎక్స్‌ట్రాపల్మొనరీ) బారిన పడే ప్రమాదం ఉందని వివరిస్తున్నారు.

ఇంట్లో తయారు చేసుకుంటే మేలు

పానీపూరీ అంటే ఇష్టమున్నా బయట తింటే అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయని బాధపడుతున్నారా? అయితే ఎంచక్కా ఇంట్లోనే రుచిగా, శుచిగా తయారు చేసుకోవచ్చు. ఇందుకు అవసరమయ్యే పదార్థాలన్నీ దుకాణాల్లో దొరుకుతాయి. వాటిని ఎలా తయారు చేయాలో యూట్యూబ్ వీడియోల్లో చూసి చేసుకోవచ్చు.

ఆరోగ్యం అంతే..!



పానీపూరీ తయారీలో వాడే పదార్థాలు ఎలా ఉన్నా చాలా మంది పరిశుభ్రమైన వాతావరణంలో వాటిని తయారు చేయడంలేదనే విమర్శలు ఉన్నాయి. సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన కొన్ని వీడియోలు సైతం అప్పుడప్పుడూ చక్కర్లు కొడుతున్నాయి. కలుషితమైన నీటినే కొందరు చిరు వ్యాపారులు వినియోగిస్తున్నారు. అలాంటి నీటిలో ఈ–కొలి వంటి బ్యాక్టీరియా, సూక్ష్మక్రిములు, ఇతర రోగ కారకాలు ఉంటాయి. అలాంటి నీటిని పానీపూరీలో వాడితే ఇక మన ఆరోగ్యం అంతే సంగతులు. అసలే వర్షాకాలం.. ఇంట్లో తాగే నీటి విషయంలోనే చాలా జాగ్రతగా ఉండాల్సిన పరిస్థితి. అలాంటిది ఏ నీటిని వాడారో తెలియని పానీపూరీని తిని అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకోవడం ఎందుకని వైద్యులు ప్రశ్నిస్తున్నారు. ఎందుకంటే సాధారణంగా పానీ పూరీ వ్యాపారులు చేతులకు గ్లౌజులు తొడుక్కోరు. ఒక చేత్తో పొయ్యిపై ఆలూ, శనగలను ఉడకబెడుతూనే, అదే చేత్తో ఉప్పు, కారం మసాలాలు చల్లుతూ పక్క నుండే ఓ నీటి గిన్నెలో చేతులు కడుగుతుంటాడు. తర్వాత అదే చేత్తో పానీపూరీలను మసాలా నీటిలో ముంచి అందిస్తుంటారు. ఈ అపరిశుభ్రతే అత్యంత ప్రమాదకరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

మెనింజైటీస్ వచ్చే ప్రమాదం

పానీపూరీలో ఎలాంటి నీరు వాడతారో తెలియదు. కలుషితమైన నీటిలో బ్రెయిన్ ఈటింగ్ అమీబా ఉండే అవకాశముంది. ఇటీవల కేరళలో ఇలాంటి కేసులు నమోదయ్యాయి. దీంతో మైనింజైటీస్ అనే వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది. ఎక్కువగా చిన్న పిల్లలకు ఇది వస్తుంది. చాలా ప్రాణాంతక వ్యాధి.

– అనుపమ, వైద్యులు

బలిజల అభ్యున్నతే లక్ష్యం



మాట్లాడుతున్న పొనగంటి భాస్కర్

తిరుపతి కల్చరల్ : బలిజల అభ్యున్నతే లక్ష్యంగా బలిజ సామాజిక న్యాయ సాధన వేదిక కన్వీనర్ చెన్న శివప్రసాద్, ప్రతినిధి పొనగంటి భాస్కర్ తెలిపారు. మంగళవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో గ్రేటర్ రాయలసీమ బలిజ, కాపు, తెలగ మహాసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ బలిజలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ, అధికార వ్యవస్థలో అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే రిజర్వేషన్ వర్తింపజేయాలన్నారు. రాయలసీమలోని బలిజలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైవీ చక్రధర్, జి.దొరబాబు, వరదరాజులు, జీఎస్ ప్రసాద్, డాక్టర్ పీఎస్ కరుణానిధి, సి.కృష్ణయ్య, ఆరణి బాలాజీ, డీవీ గిరి, తులసీ రామ్, విశ్వనాథ్, వెంకటేష్ పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో ఆయుధ పూజ



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, మేయర్, అధికారులు

తిరుపతి తుడా : మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఘనంగా ఆయుధ పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ శిరీష, కమిషనర్ మౌర్య ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ వాహనాలకు పూజలు చేశారు. వారు మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు, సిబ్బందికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. వాహనాలను జాగ్రత్తగా నడపాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, రవి, మేనేజర్ హసీమ్ పాల్గొన్నారు.

ఘనంగా ఉద్యోగ విరమణ సత్కారం



మోహన మూర్తి దంపతులను సత్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఇంగ్లిష్ విభాగాధిపతి పి.మోహనమూర్తి ఉద్యోగ విరమణ సత్కార సభను మంగళవారం కాలేజీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఆదర్శ భావాలు కలిగిన ఉత్తమ అధ్యాపకుడు మోహనమూర్తి అని కొనియాడారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌లో రెండు దశాబ్దాల పాటు రాజీ లేని పోరాటం చేశారని వెల్లడించారు. ప్రిన్సిపల్ వేణుగోపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ భాస్కరుడు, సీఐటీయూ నేత కందారపు మురళి మాట్లాడుతూ మోహనమూర్తి సేవలను కొనియాడారు. అనంతరం మోహనమూర్తి మాట్లాడుతూ దేవదేవుని సన్నిధిలో పని చేయడం పూర్వజన్మ సుకృతమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భీమన్న, డాక్టర్ కేఎం దయాన్, విజయ, అన్నయ్య, కేఎల్ వర్మ పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి సమష్టి కృషి

తిరుపతి తుడా : తిరుపతి నగర అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ మౌర్యతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్య పనులు, పన్ను వసూలు, నగర సుందరీకరణ పనులపై సమీక్షించారు. అంతర్గత రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేయాలన్నారు. పరిశుభ్రమైన తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, సెక్రటరీ రాధిక, రెవెన్యూ ఆఫీసర్స్ సేతుమాధవ్, రవి, డీసీపీ మహాపాత్ర, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, మేనేజర్ హసీమ్ పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలం.. ఆగని నిర్మాణం



షాపింగ్ కాంప్లెక్స్ సాగుతున్న పనులు

చంద్రగిరి : మండలంలోని మల్లయ్యపల్లె మార్గంలో ఓ మహిళ ప్రభుత్వ భూమిని ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టింది. సర్వే నంబర్ 1016లోని వాగు పోరంబోకులో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ శివరామసుబ్బయ్య స్పందించి వెంటనే పనులు ఆపేయాలని ఆదేశించారు. అయితే కబ్జాదారులు సదరు ఆదేశాలను బేఖాతరు చేస్తూ నిర్మాణ పనులు కొనసాగిస్తూనే ఉన్నారు. ఆక్రమణ వెనుక టీడీపీ నేతలు ఉండడంతో అధికారులు సైతం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో గ్రామస్తులు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కూడా షాపింగ్ కాంపెక్స్ పనులు జరుగుతుండడంతో రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వీఆర్‌ఏ అక్కడకు చేరుకుని నిర్మాణ పనులు ఆపేయాలని చెప్పి వెళ్లిపోయారు. అయితే కబ్జాదారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. నాన్చుడు ధోరణిని విడిచిపెట్టి రెవెన్యూ అధికారులు కఠినంగా వ్యవహరించి కబ్జాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా సాహితీ సమితి సదస్సు



అతిథులకు జ్ఞాపిక అందిస్తున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో మంగళవారం తెలుగు సాహితీ సమితి సదస్సును ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ కంప్యూటర్ల ద్వారా భాష, సాహిత్యం కొత్తకోణంలోకి ప్రవేశిస్తున్నాయన్నారు. ఈ అవకాశాలను పిల్లలు అందిపుచ్చుకోవాలని కోరారు. సాహితీ సమితి సలహాదారు డాక్టర్ వై.సుభాషిణి మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల ద్వారా పిల్లల్లో భాషాభిమానంతో పాటు కార్యదక్షత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని వెల్లడించారు. అనంతరం అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు. జాతీయ సంస్కృత వర్సిటీ రిజిస్ట్రార్ రమశ్రీ, అధ్యాపకులు యువశ్రీ, లక్ష్మీప్రియ, హరిపద్మరాణి, శారద, నిర్మల, నీరజ, వాణి పాల్గొన్నారు.

పడిగాపులు.. మళ్లీ మొదలు!

- 11 గంటలు దాటినా కనిపించని రెవెన్యూ ఉద్యోగులు
- సమస్యలు చెప్పుకునేందుకు ప్రజల ఎదురుచూపులు



తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా కుర్చీలు

చంద్రగిరి : కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని శాఖల అధికారుల్లో నిర్లక్ష్యం పెరిగిపోయింది. పట్టించుకునేవారు లేకపోవడంతో అలసత్వం పెచ్చుమీరింది. ముఖ్యంగా రెవెన్యూ సిబ్బందిలో సమయ పాలన కొరవడింది. ఈ క్రమంలోనే చంద్రగిరి తహసీల్దార్ కార్యాలయానికి ఉద్యోగులు సకాలంలో రావడం లేదు. ఉదయం 11 గంటలు దాటినా విధులకు హాజరు కావడం లేదు. వివిధ సమస్యలు విన్నవించుకునేందుకు వచ్చిన వారికి పడిగాపులు తప్పడం లేదు. ఈ మేరకు మంగళవారం ఉదయం కూడా కింది స్థాయి సిబ్బంది తప్ప ఒక్క అధికారి అందుబాటులో లేరు. దీంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దూర ప్రాంతాల నుంచి వివిధ సమస్యలపై అర్జీ సమర్పించుకుందామని వస్తే కనీసం సీనియర్ అసిస్టెంట్ కూడా లేరని నిరాశగా వెనుతిరిగారు. మంగళవారం ఓ గ్రామసభకు తహసీల్దార్ హాజరయ్యారు. ఆయన వెంట కొందరు అధికారులు సైతం వెళ్లారు. అయితే రెవెన్యూ కార్యాలయంలో డీటీ, ఆర్‌ఐలు కూడా లేకపోవడంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీనిపై ప్రశ్నిస్తే ఫీల్డ్ పనిపై వెళ్లామని అధికారులు దురుసుగా సమాధానమిస్తున్నారని మండిపడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాయాలనికి వెళితే తమ సమస్యలు ఇట్టే పరిష్కరించేవారని, ఇప్పుడు ఆ వ్యవస్థను సైతం నిర్వీర్యం చేసేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రతి పనికీ తహసీల్దార్ కార్యాలయానికే రావాల్సి వస్తోందని వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెవెన్యూ అధికారులు సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.